## క్లుప్తంగా

### ఐదుగురు బైండోవర్

బుచ్చినాయుడుకండ్రిగ: త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో మండలంలోని కల్లివెట్టు, పార్లపల్లె గ్రామాలకు చెందిన ఐదుగురిని గురువారం తహసీల్దారు భార్గవి ఎదుట హాజరు పర్చారు. ఆమె మాట్లాడుతూ ఎన్నికల సమయంలో గొడవలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించి, సంతకాలు తీసుకున్నారు.

### పోలింగ్ కేంద్రాల్లో వసతులు

సత్యవేడు: ఎన్నికలకు కేటాయించిన పోలింగ్ కేంద్రాల్లో వసతుల వివరాలను సేకరించాలని సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సీఆర్పీలకు ఎంఈఓ కె.రవి సూచించారు. గురువారం పోలింగ్ కేంద్రాల్లో వసతులపై సమావేశం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ కేంద్రాలో తాగునీటి వసతి, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం, ఫర్నిచర్లు వివరాలను నాడు–నేడు యాప్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. ఎంపీడీఓ చంద్రశేఖర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



ట్యాబ్‌లు అందజేస్తున్న హెచ్‌ఎం

సత్యవేడు: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 8వతరతి విద్యార్థులకు బైజూస్ కంటెంట్ అప్‌లోడ్ చేసిన ట్యాబ్‌లను ప్రధానోపాధ్యాయరాలు కె. భారతి అందజేశారు. గురువారం పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులు ట్యాబ్‌తో పాటు పౌచ్, ఓటీజీ ఎస్డీ కార్డు చార్జర్ కేబుల్, టెంపర్‌గ్లాస్ స్టికర్ అందించారు.

### అయోధ్య అక్షింతల పంపిణీ



అక్షింతలు అందజేస్తున్న గౌరి

ఏర్పేడు: మండలంలోని కోబాకలో ఎంపీటీసీ సభ్యురాలు గౌరీ ఆధ్వర్యంలో గురువారం అయోధ్య పవిత్ర అక్షింతలను పంపిణీ చేశారు. ఇంటింటికీ వెళ్లి అయోధ్య అక్షింతలతో పాటు శ్రీరాముని చిత్రపటం అందజేశారు. అయోధ్యలో శ్రీరాముని ఆలయం ప్రారంభం రోజున భక్తి శ్రద్ధలతో హిందువులు ఇళ్లలో పూజలు చేయాలని సూచించారు.

# జగనన్నతోనే సామాజిక సాధికారత

- ఇంటి ముంగిటకే సంక్షేమ లబ్ధి
- గడపగడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి



పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

ఏర్పేడు: గతంలో సామాజిక సాధికారత ఒక నినాదంగా ఉండేదని, రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో సామాజిక సాధికారతను అమలు చేసి ఒక విధానంగా మార్చారని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మత్రిమందలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. గ్రామస్తులు, పార్టీ నాయకులు పూలమాలలు, శాలువలతో సన్మానించి ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. మహిళలు మంగళ హారతులు పట్టారు. గ్రామంలో 340 ఇళ్లకు వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక పేదలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదుగుతున్నారని వివరించారు. విద్య పేదల తలరాతలను మారుస్తుందని నమ్మిన సీఎం జగనన్న విద్యారంగంలో పలు మార్పులకు శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. ప్రతి ఇంటి తలుపు తట్టి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత దేశ చరిత్రలో సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. నెలకు అవ్వాతాతలకు రూ.3 వేలు పెన్షన్ అందిస్తున్నట్లు వెల్లడించారు. నవరత్న పథకాలతో వెలుగులు నింపిన జగనన్నకు ప్రజలు అండగా నిలవాలని కోరారు. వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు నాగరాజు రెడ్డి, మునిరాజా, వైస్ ఎంపీపీ శ్రీనివాసులు, కో–ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, పార్టీ మండల అధ్యక్షుడు రమణయ్య యాదవ్, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు నల్లపాలెం శివయ్య, సింగిల్‌విండో అధ్యక్షుడు జనార్దన్‌యాదవ్, మాజీ అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, నాయకులు సుధీర్‌కుమార్, మస్తాన్, కృష్ణారెడ్డి, ఎస్‌ఎస్‌చంద్ర, గోపి, ఈశ్వర్, రామయ్య ఆచారి, మునిరత్నం నాయుడు, గురునాథం తదితరులు పాల్గొన్నారు.

## హోరాహోరీగా ఆడుదాం-ఆంధ్ర





వరదయ్యపాలెం: వాలీబాల్ విజేత బత్తలవల్లం జట్టు, నారాయణవనం: గెలిచిన క్రీడాకారులతో అధికారులు

వరదయ్యపాళెం: ఆడుదాం– ఆంధ్ర క్రీడల్లో భాగంగా గురువారం వాలీబాల్ పోటీలు రసవత్తరంగా జరిగాయి. ఫైనల్స్‌లో బత్తలవల్లం సచివాలయం జట్టును విజయం వరించింది. రన్నర్స్‌గా కాంబాకం టీమ్ నిలిచింది. బత్తలవల్లం క్రీడా మైదానంలో 12 సచివాలయాలకు సంబంధిం క్రికెట్ పోటీల ఫైనల్స్ శుక్రవారం జరుగుతాయని ఆడుదాం– ఆంధ్ర కో–ఆర్డినేటర్ బందిల కుమార్ తెలిపారు.

నారాయణవనం: స్థానిక బాలికల ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో మండల స్థాయి క్రీడల్లో ఖోఖో, బ్యాడ్మింటన్ పురుషులు, మహిళల విభాగంలో పోటీలు నిర్వహించారు. ఆడుదాం ఆంధ్ర మండల కోఆర్డినేటర్ జయప్రకాష్ మాట్లాడుతూ పురుషుల ఖోఖో ఫైనల్స్‌లో కొండలచెరువుపై పాలమంగళం సచివాలయం విజయాన్ని సాధించిదని తెలిపారు. బ్యాడ్మింటన్‌లో పురుషుల విభాగంలో నారాయణవనం–3 సచివాలయం విజయం సాధించిందన్నారు. మహిళల బ్యాడ్మింటన్ విభాగంలో అరణ్యంకండ్రిగ జట్టు విజయం సాధించినట్లు తెలిపారు. వాలీబాల్‌లో తిరువట్యం జట్టు, క్రికెట్‌లో కీళగరం, వెంకటకృష్ణపాళ్యం సచివాలయాల జట్లు నియోజకవర్గ స్థాయికి ఎంపికైనట్లు వివరించారు. ఎంపీడీవో కృమూర్తి, ఏవో గుణశేఖర్ పాల్గొన్నారు.

నాగలాపురంలో..

నాగలాపురం: స్థానిక జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఎంపీడీఓ పీఎంకే బాబు ఆధ్వర్యంలో గురువారం కబడ్డీ పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు టి.అపరంజిరాజు విచ్చేశారు. నాగలాపురం –1 సచివాలయం గెలుపొందినట్లు కార్యదర్శి హరి తెలిపారు. సర్పంచ్ సుధా చిన్నదొరై, ఎంపీపీ సింధూ శ్యామ్, ఎంఈఓ జనార్దనరాజు పాల్గొన్నారు.

పిచ్చాటూరులో..

పిచ్చాటూరు: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో గురువారం ఖోఖో పోటీలను సర్పంచ్ కేజీ రోస్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ కేటీ హరిశ్చంద్రా రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసులు ఈ పోటీలను ప్రారంభించారు. పురుషుల విభాగంలో వెంగళత్తూరు జట్టు, మహిళల విభాగంలో కీళపూడి జట్టు విజేతలుగా నిలిచినట్లు ఎంఈఓ యుగంధర్ రాజు వెల్లడించారు.

### ఒకరికి గాయాలు

ఏర్పేడు: మండలంలోని సీతారాంపేట వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు గాయపడ్డారు. సీఐ శ్రీహరి అందించిన వివరాలు.. వెంకటగిరికి చెందిన వేణుగోపాల్(43) ద్విచక్ర వాహనంపై తిరుపతికి వెళుతున్నాడు. సీతారాంపేట వద్ద ముందు వెళుతున్న బస్సును అధికమించబోయి అదుపుతప్పడంతో ప్రమాదం జరిగింది. చికిత్స కోసం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

### పంపిణీకి సిద్ధంగా ఎరువులు



బీఎన్‌కండ్రిగ: ఎరువుల పంపిణీ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో పంపిణీకి ఎరువులు సిద్ధంగా ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి భారతి తెలిపారు. గురువారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో రైతులకు యూరియా, డీఏపీ ఎరువులను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా 21 రకాల సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా వైఎస్సార్ రైతు భరోసా, నాణ్యమైన ఉత్పాదకాల సరఫరా, సబ్సిడీ విత్తనాలు పంపిణీ, ఈ–పంట, పంట నమోదు, మార్కెట్ ధరలు, వ్యవసాయ యంత్రీకరణ, పశువైద్యం, ఉద్యానవన శాఖ, పట్టుపరిశ్రమ, వాతావరణ సూచనలు, సలహా మండళ్లు, మట్టి పరీక్షలు తదితరాలు ఉన్నాయని తెలిపారు. ఈ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### విధులకు హాజరు

సత్యవేడు: మండలంలోని సమగ్రశిక్ష సిబ్బంది 15 మంది సమ్మె విరమించారు. ఈమేరకు తాము విధుల్లో చేరుతున్నట్లు ఎంఈఓ కె.రవికి రాతపూర్వకంగా తెలియజేశారు. గురువారం ఉదయం కార్యాలయ పరిధిలో ఎంఐఎస్, సీఆర్‌ఎంటీఎస్, పీటీఐ, ఐఆర్టీలు విధులకు హాజరైనట్లు ఎంఈఓ తెలిపారు.

# రేణిగుంట అభివృద్ధికి పెద్దపీట



కాలువల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న బియ్యపు పవిత్రారెడ్డి

- బియ్యపు పవిత్రారెడ్డి
- రూ.75లక్షలతో డ్రైనేజీ నిర్మాణాలకు భూమి పూజ

రేణిగుంట: రేణిగుంట పట్టణ అభివృద్ధికి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ బియ్యపు పవిత్రా రెడ్డి అన్నారు. రేణిగుంట పాంచాలినగర్‌లో గురువారం రూ.75లక్షల నిధులతో నిర్మించనున్న డ్రైనేజీ కాలువల నిర్మాణం, పలు అభివృద్ధి పనులకు ఆమె భూమి పూజ చేశారు. పాంచాలినగర్‌లో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తుండడంతో స్థానికుల ఇబ్బందులను ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే గుర్తించారని, రూ.75లక్షలు నిధులు మంజూరు చేయించి కాలువలను నాణ్యతతో నిర్మించాలని ఆదేశించారని ఆమె పేర్కొన్నారు. నాలుగేళ్లగా మండు వేసవిలో సైతం తాగునీటి సమస్య తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకున్నామన్నారు. నెల రోజులుగా తెలుగుగంగ నీరు రాకపోవడంతో వల్ల సమస్య ఏర్పడటంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తుంటే ప్రతిపక్షాలు రాజకీయం చేయడం దారుణంగా ఉందన్నారు. ప్రజలు వాటిని నమ్మవద్దని కోరారు. కచ్చితంగా తాగునీటి సమస్యకు త్వరలోనే శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. రేణిగుంట ఎంపీపీ కలపాటి హరిప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ టి.సంధ్యారాణి, వైస్ ఎంపీపీ సుజాత, జువ్వల దయాకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు రసూల్, సర్పంచ్ నగేషం, కోఆప్షన్ సభ్యుడు హసన్ సాహెబ్, జాన్‌బాబు, ఇరానీ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

## దళితుల పక్షపాతి సీఎం జగన్

బుచ్చినాయుడుకండ్రిగ: విజయవాడలో ఈనెల 19వ తేదీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో గురువారం గ్రామ సచివాలయం వద్ద సర్పంచ్ వెంకటమ్మ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దళితుల ఆత్మగౌరవాన్ని పెంచేలా విజయవాడలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుతో సీఎం జగనన్న దళితుల పక్షపాతిగా నిలిచారని తెలిపారు. అంబేడ్కర్ నిర్దేశించిన సామాజిక న్యాయ మార్గంలో నడుస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఉపసర్పంచ్ మునిరాజా, గ్రామ కార్యదర్శి ఇందిరమ్మ పాల్గొన్నారు.

## కులగణన సర్వే సమగ్రంగా చేపట్టాలి

సత్యవేడు: మండలంలోని 17 సచివాలయాల పరిధిలో కుల గణన సర్వే సమగ్రంగా చేపట్టాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. గురు వారం ఎంపీడీఓ కార్యాలయం సర్వేపై సచివాలయ సెక్రటరీలు, వెల్ఫేర్ అసిస్టెంట్లకు అవగాహన సమావేశం జరిగింది. సర్వేలో వ్యక్తి పేరు, వయస్సు, వ్యవసాయభూమి, నివాసభూమి, పశుసంపద, వృత్తి సమాచారం, వివిధ మార్గాల ద్వారా వచ్చే ఆదాయం, కులం, ఉపకులం, మతం, విద్యార్హతలు, ఇంటి రకం, సరక్షిత తాగునీరు, మరుగుదొడ్లు, గ్యాస్ వివరాలు సమగ్రంగా పొందుపరచాలన్నారు. సర్వే పరిశీలనకు సూపర్‌వైజర్లను నియమించినట్లు తెలిపారు. ఎంఈఓ కె.రవి, సెక్రటరీలు పాల్గొన్నారు.

### 15న సూర్యనారాయణ హోమం

వరదయ్యపాళెం: మండలంలోని అమ్మాభగవాన్ ఏకం ఆశ్రమం ఆధ్వర్యంలో వరదయ్యపాళెంలోని గోవర్ధనపురంలో ఉన్న లోకా ఫౌండేషన్ కార్యాలయంలో మకర సంక్రాంతిని పురస్కరించుకుని తలపెట్టిన సూర్యనారాయణ హోమంను విజయవంతం చేయాలని ఆ సంస్థ ప్రతినిధి బొప్పన రమేష్ పిలుపునిచ్చారు. ఆ మేరకు ఆయన గురువారం సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ, మకర సంక్రాంతి పండుగ రోజున సూర్య భగవానుడు మకర సంక్రమణ పురుషుడిగా అశ్వ వాహనం ఎక్కి మకరాది నుంచి కర్కాటక రాశి పర్యంతం సంచరిస్తారని తెలిపారు.



మాట్లాడుతున్న రమేష్

ఈనెల 15న సకల జీవరాశుల ప్రత్యక్ష దైవం సూర్యనారాయణస్వామి మకరరాశి ప్రవేశ శుభ సమయంలో ఉదయం 10 గంటల నుంచి హోమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ దైవ కార్యక్రమంలో ప్రతిఒక్కరూ పాల్గొనాలని కోరారు. పీఆర్వో ఖాదర్ బాషా పాల్గొన్నారు.



### ముక్కంటి సేవలో మాజీ సీఎస్

శ్రీకాళహస్తి: శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని గురువారం తెలంగాణ రాష్ట్ర మాజీ సీఎస్ సోమేశ్వరకుమార్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దేవస్థానం ఈవో కేఎస్ రామారావు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా వారు ప్రత్యేక రాహుకేతు పూజలను చేయించుకున్నారు. అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. వేదపండితులు వారిని ఆశీర్వదించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

### అధ్యాపకులకు సత్కారం



రేణిగుంట(శ్రీకాళహస్తి): శ్రీకాళహస్తి పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో గురువారం డాక్టరేట్ అందుకున్న సి.బాపనయ్య, వి.సతీష్‌కుమార్, టి.తులసిని అధ్యాపక బృందం సత్కరించింది. కంప్యూటర్ ఆపరేటర్ విభాగంలో డాక్టర్ ఏ.రవిప్రసాద్‌ను కూడా సన్మానించారు. వారి సేవలను ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీలత, వైస్ ప్రిన్సిపల్ మురళి కొనియాడారు.

### గిరిజన కాలనీల్లో శ్రమదానం



నచ్చనేరి పిచ్చి మొక్కల తొలగింపు

ఏర్పేడు: మండలంలోని నచ్చనేరి, చిందేపల్లి గిరిజన కాలనీల్లో ప్రజా సాధికారిక సమితి ఆధ్వర్యంలో గురువారం శ్రమదానం జరిగింది. గ్రామస్తులు రోడ్లు, ఇళ్ల వద్ద పిచ్చి మొక్కలు, చెత్తచెదారాలను తొలగించారు. సమితి కార్యదర్శి దేవేంద్ర పరిసరాల పరిశుభ్రత, ప్రాముఖ్యతపై గిరిజనులకు అవగాహన కల్పించారు. పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని తెలిపారు.

### విశ్రాంత ప్రిన్సిపాళ్లకు సన్మానం



సన్మానం అందుకున్న విశ్రాంత ప్రిన్సిపాళ్లు

రేణిగుంట(శ్రీకాళహస్తి): శ్రీకాళహస్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాళ్లు డాక్టర్ ఏ.రాధయ్య, డాక్టర్ సి.సుకుమార్‌రెడ్డిని గురువారం అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. వారు కళాశాలతో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఏ.రామయ్య విద్యార్థుల భవిష్యత్తు కోసం గ్రంథాలయ పుస్తకాలకు రూ.10వేలు విరాళంగా అందజేశారు. వైస్ ప్రిన్సిపల్ మురళి, అధ్యాపకులు బాపనయ్య, పరంధామయ్య, ఈ.రాజేంద్రుడు, వెంకటేశ్వర్లు, తులసి పాల్గొన్నారు.

### ముగ్గురు నిందితుల అరెస్ట్

ఏర్పేడు: బంగారు నగల చోరీ కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు సీఐ శ్రీహరి గురువారం రాత్రి తెలిపారు. గత నెల 30న పాపానాయుడుపేటలో ముగ్గురు రెండు ద్విచక్ర వాహనాలపై దిగి బంగారు నగల దుకాణంలో నాటు తుపాకితో కాల్పులు, కత్తులతో బెదిరించి 50 గ్రాముల బంగారు నగలు ఒక ద్విచక్ర వాహనాన్ని అపహరించుకుని వెళ్లినట్లు వివరించారు. అదే రోజు నిందితుడు విశ్వను గ్రామస్తులు పట్టుకున్నట్లు చెప్పారు. గురువారం విశ్వతో పాటు రాజేష్, ఆనంద్‌ను అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. నిందితుల నుంచి 50 గ్రాములు బంగారు నగలు, 4 నాటు(దేశీయ) తుపాకులు, రెండు కిలోల గంజాయి. ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ చెప్పారు.

### పిల్లలను పనిలో పెట్టుకుంటే నేరం

శ్రీకాళహస్తి (రేణిగుంట): పిల్లలను పనిలో పెట్టుకోవడం, పని చేయించడం నేరమని లేబర్ ఇన్‌స్పెక్టర్ రంగనాథ్ తెలిపారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం చేపట్టిన ఆపరేషన్ స్వేచ్ఛ–1 డ్రైవ్‌లో భాగంగా గురువారం పట్టణంలో తనిఖీలు నిర్వహించారు. వ్యాపార యజమానులకు బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సహాయ కార్మిక శాఖ అధికారి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### వైభవంగా మౌళి అమావాస్య ఉత్సవం



స్వామి,అమ్మవార్ల ఊరేగింపు

శ్రీకాళహస్తి: శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురువారం మౌళి అమావాస్య ఉత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ అలంకార మండపంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవర్లకు విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి ధూప,దీప నైవేద్యాలు సమర్పించారు. తదుపరి మేళతాళాలు మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్చారణల నడుమ స్వామి,అమ్మవార్లను చప్పరాలపై కొలువుదీర్చి అధిష్ఠింపజేసి పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు అడుగడుగునా కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో కేఎస్ రామారావు, పాలకమండలి సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

### నేడు పిచ్చాటూరులో 'జగనన్నకు చెబుదాం'

పిచ్చాటూరు: పిచ్చాటూరులో శుక్రవారం 'జగనన్నకు చెబుదాం' మండల స్థాయి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే ఈ కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు. మండలంలోని ప్రజల నుంచి సమస్యల వినతులు స్వీకరిస్తారన్నారు. అర్జీలను పరిశీలించి త్వరితగతిన పరిష్కారం చూపుతారని వివరించారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ తెలిపారు.